క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

చీరాల టౌన్: పంచాయతీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ బి.శివసుబ్రమణ్యం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. ఎండలు విపరీతంగా కాస్తున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా వాటర్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లు మరమ్మతులు చేయించి మంచినీరు ప్రజలకు అందించాలన్నారు. కార్యదర్శులు శ్రీనివాసరావు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లున్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం మృగశిర నక్షత్రం చవితి తిధి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఉఫ్‌పాధి..!

- ఉపాధి కూలీల గురించి పట్టించుకోని ప్రభుత్వం
- ఎండ వేడిమి.. దాహార్తితో ఆర్తనాదాలు
- తక్కువ మందికే పనుల కేటాయింపు
- పని ప్రదేశంలో కనిపించని కనీస వసతులు



ఈపురుపాలెం పంచాయతీలో కాలువ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

చీరాల టౌన్: పల్లె ప్రజలకు ఆసరాగా ఉండే ఉపాధి పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కూలీలకు జాబ్ కార్డులు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారు కానీ.. వారికి కావాల్సిన సౌకర్యాలు అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఈ వేసవిలో ఇప్పటికే విపరీతంగా ఎండలు కాస్తున్నా కూలీలు తాగేందుకు మంచినీరు, పనిప్రదేశంలో టెంట్లు, గాయాలైతే ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి వసతులు ఏర్పాటు చేయడంలో శీతకన్ను వేస్తున్నారు. మరో వైపు ఎర్రటి ఎండలో మగ్గుతున్నా ఎప్పుడు కూలి అందుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో జాబ్‌కార్డులున్నవారు కూడా పనులు చేయడానికి సాహసించడంలేదు. చీరాల మండలంలోని 15 పంచాయతీల్లో 8042 జాబ్‌కార్డులున్నాయి. అధికారుల లెక్కల్లో మాత్రం 5036 మంది ఉపాధి కూలీలున్నారు. కాగా వీటిలో 2381 మంది కూలీలకే ఉపాధి పనులు దొరుకుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో పంటకాలువల పూడికతీత పనులను మాత్రమే నిర్వహిస్తున్నారు. ప్రతీరోజూ ఉదయం 6 గంటల నుంచి 11 వరకు ఉపాధి హామీ పని చేసిన శ్రామికులకు రోజు కూలీగా రూ.307 నిర్ధారించారు. అయితే కొలతల్లో తేడాలు, ఇతరత్రాల పేరుతో ఒక్కొక్కరికి సగటున రోజుకు రూ.278 మాత్రమే చెల్లిస్తున్నారు. అయితే డబ్బులు వారి బ్యాంకు అకౌంట్లలో జమ అవుతాయని చెబుతున్నా గత కొద్ది నెలలుగా ఖాతాల్లో పడటం లేదు. 2025–26 ఆర్థిక సంవత్సరాల్లో రూ.6 కోట్ల ఉపాధి పనులను అధికారులు గుర్తించారు. 2026 మార్చి 31 కల్లా 2.30 లక్షల పని దినాలు కల్పించాల్సి ఉండగా కేవలం 1.5 లక్షల పని దినాలు మాత్రమే లెక్కలోకి వస్తున్నాయి. ప్రతి వారం చెల్లించాల్సిన నగదును బిల్లుల రూపంలో పంపినా సక్రమంగా చెల్లింపులు జరగడంలేదు. ప్రభుత్వ ఖజానాలో నగదు లేవనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఎక్కడ?

పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేయాలనే ఆదేశాలు వచ్చాయి. ఈ ఏడాది కూలీలకు మజ్జిగ అందించేందుకు నిధులేమి రాకపోవడంతో వారికి ఏమీ ఇవ్వడంలేదు. అలానే టెంట్లు కూడా వేయడంలేదు. అలానే కూలీలకు మజ్జిగ బదులుగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాల్సి ఉండగా ఆ ఊసే లేదు.

> **బడ్జెట్ విడుదల చేశారు:**
> గతంలో పనిచేసిన ఉపాధి కూలీలకు పెండింగ్ బకాయిలు ప్రాధాన్యతా క్రమంలో వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసింది. ఎండలో కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి. మంచినీరు తెచ్చుకోవాలి. మజ్జిగ పంపిణీ చేస్తారో లేదో తెలియదు.
> – దాసు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో దుర్గామాత



సాయంత్రం పూలంగి సేవలో అమ్మవారు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువుల మధ్య కొలువైన శ్రీవైష్ణవీ దుర్గామాత ఆలయ 25వ వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, పవిత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయాన్ని, అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూలంగి సేవలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎస్తేరమ్మ

అద్దంకి రూరల్: పట్టణాభివృద్ధి చేపట్టే పలు అభివృద్ధి పనులకు కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రావు అజెండాలోని 26 అంశాలను చదివి కౌన్సిల్ సభ్యులకు చదవి వినిపించారు. ఎవరు అభ్యంతాలు తెలపకపోవటంతో అధ్యక్షురాలు ఎస్తేరమ్మ అభివృద్ధి ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదిస్తున్నట్లు తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుళాయిలు మరమ్మతులు చేయిస్తాం

- ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు అంచనాలు తయారు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

బల్లికురవ: మండలంలోని కొణిదెన ఎస్సీ కాలనీకి మంచినీటి సరఫరానిచ్చే పైపులైన్లు.. కుళాయిలకు తక్షణమే మరమ్మతులతో పాటు, ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు అంచనాలు తయారు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ తెలిపారు. బుధవారం సాక్షిలో 'ప్రాణాలు పోతున్నాయ్.. కాపాడండయ్యా' అన్నశీర్షిక ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హుటాహుటిన కొణిదెన గ్రామానికి వెళ్లి మంచినీటి పథకాన్ని, స్టోరేజ్ చెరువును పరిశీలించి ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో ఇటీవల కాలంలో సిమెంట్ రోడ్డు నిర్మాణాలు చేపట్టటంతో పైపు లైన్, కుళాయిలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఒక వీధిలో మూడు కుళాయిలు మాత్రమే పనిచేస్తున్నాయని, మిగిలిన విధుల్లో పైపులైన్‌లు కుళాయిలను పరిశీలించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి మంచినీరు అందిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అయితే ఈ నీరు తాగేందుకు అనుకూలంగా లేవని తమ కాలనీకి ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ కుసుమకుమారికి విన్నవించినట్లు కాలనీవాసులు చెప్పారు. ఎంపీడీఓ ఆదేశాల మేరకు తాము ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు అంచనాలు తయారు చేసేందుకు వచ్చానని పరిశీలించి ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేస్తానని వివరించారు.



కొణిదెన ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఏఈ

గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలు

అద్దంకి: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 3వ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, కుల ధ్రువీకరణపత్రం, విద్యార్థి పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8328452173, 8106567470, 9440883284 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. 3వ తరగతిలో ఎస్టీకి సంబంధించి 32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

పాలిసెట్‌కు 102 మంది గైర్హాజరు

అద్దంకి రూరల్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌కు బుధవారం అద్దంకి మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 856 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 754 మంది విద్యార్థులు హాజరయ్యారు. 102 మంది గైర్హాజరైనట్లు అద్దంకి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ లాజరస్ బాబు తెలిపారు. పరీక్షలు ప్రశాతంతంగా జరిగాయన్నారు.

వీల్‌చైర్‌లు అందజేత




పర్చూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వీల్‌చైర్‌లు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు(చినగంజాం): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు పర్చూరు రోటరీ క్లబ్ ద్వారా వీల్ చైర్‌లు అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక రోటరీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ హైదరాబాద్, పిడుగురాళ్ళ రోటరీ క్లబ్‌ల సహకారంతో 5 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వీల్‌చైర్‌లు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ కె. శరత్ చౌదరి, బాలకోటిరెడ్డి, విష్ణుబాబు, కేఎస్ఆర్‌కే ప్రసాద్, రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగుబడి సుబ్బారావు, నాగుబైరు శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, కొల్లా నరేంద్ర కుమార్, భవనం రాజగోపాల రెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు, మున్నంగి వెంకట సుబ్బయ్య, పోలిశెట్టి చంద్రం, పంబి సదానందరెడ్డి, కాల్వ సత్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అయ్యో.. చెరువు కలుషితం

- అధ్వానంగా ఉప్పుటూరు చెరువు
- నీటిని కలుషితం చేస్తున్న పశువుల మంద
- పట్టించుకోని అధికారులు



ఉప్పుటూరు చెరువులో చేరిన పశువులు

పర్చూరు(చినగంజాం): మండలంలోని ఉప్పుటూరు గ్రామ చెరువు పరిస్థితి అధ్వానంగా మారింది. చెరువులో నీరు అడుగంటి పరిస్థితి చేరుకుంది. అంతే కాకుండా నిత్యం పశువులు చెరువులో చేరి నీటిని కలుషితం చేస్తున్నాయి. గ్రామంలోని కుళాయిలకు చెరువు నీటినే అందించాల్సి రావడంతో గ్రామ ప్రజలు మండి పడుతున్నారు. ఫిల్టర్‌లు కూడా సరిగా పనిచేయని స్థితిలో ఉండటంతో కలుషిత నీరు నేరుగా కుళాయిల ద్వారా ఇళ్ళకు సరఫరా అవుతున్నాయి. అదే నీటిని గ్రామ ప్రజలు వినియోగిస్తుండటంతో పలువురు చర్మవ్యాధులు బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. చెరువులో జమ్ము విపరీతంగా పెరిగి పోయింయది. గ్రామ ప్రజలకు సక్రమంగా పరిశుభ్రమైన నీరు అందక పోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నీటిని వేసవి కాలంలో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన సమయంలో చెరువులో పశువులు దిగి నీటిని మురికి చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామస్తుల ఇబ్బందులను తొలిగించేందుకు కార్యదర్శి సత్వరం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చందన అలంకారంలో శ్రీనివాసుడు



చందన అలంకారంలో శ్రీనివాసుడు

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీనివాసునికి విశేష చందన అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అలంకరణలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి



కారంచేడులో వేసవి విజ్ఞాన తరగతుల్లో చిన్నారులు

కారంచేడు: ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే తమకు అందుబాటులో ఉండే పుస్తకాలు, గ్రంథాలయాల్లో విజ్ఞానం పెంపొందించే ప్రతి పుస్తకం చదవాలని గ్రంథపాలకుడు ఎం. నాగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు చెరువు కట్ట మీద ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో మే 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పలు రకాల కథలు, ఆటలు, పాటలు, విజ్ఞానాన్ని పెంపొందించే అనేక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పుస్తక పఠనం అలవర్చుకుంటే పెద్ద వారు అయిన తరువాత కూడా అలవాటు పోదన్నారు. అవసరమైన పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు.

కార్మికులు అంబేడ్కర్ మేడేగా జరుపుకోవాలి

చినగంజాం: మేడేను కార్మికులు.. అంబేడ్కర్ మేడేగా నిర్వహించి ఆయనకు నివాళులర్పించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఒక ప్రకనటలో పేర్కొన్నారు. అంబేడ్కర్ బ్రిటిషు ప్రభుత్వంలో 1942–46 మధ్య లేబర్ కమిషనర్‌గా పనిచేశారని ఆ సమయంలో కార్మికుల కోసం ఆయన అనేక చట్టాలు పోరాడి సాధించారన్నారు. సోషలిజం అని కలలు గనే కమ్యూనిస్టులు, మార్క్స్, మావో, లెనిన్‌ల గురించి మాట్లాడతారే తప్ప కార్మికుల కోసం అంబేడ్కర్ చేసిన చట్టాలు గురించి చర్చించకపోవడం శోచనీయమన్నారు. సమ్మె కార్మికుల ప్రాథమిక హక్కు అని 1937లోనే పోరాడిన అంబేడ్కర్‌ను విప్లవ కమ్యూనిస్టు పార్టీలు కూడా విస్మరించడం చారిత్రాత్మక ద్రోహం అన్నారు. 1942 వరకు ఉన్న 14 గంటల పనిదినాన్ని 8 గంటలకు తగ్గించిన ఘనత అంబేడ్కర్‌ది అన్నారు. అంతేగాకుండా 1923 వర్క్‌మెన్ కాంపెన్సేషన్ చట్టం, 1936లో పేమెంట్ ఆఫ్ వేజెస్ చట్టం, 1943లో ఆరోగ్య బీమా చట్టం, 1944లో సెలవుల్లో జీతం చెల్లించే చట్టం, 1948లో కనీస వేతన చట్టం వంటి వాటిని ఆనాటి బ్రిటిషు పాలకులతో అంబేడ్కర్ పోరాడి సాధించారన్నారు. ఎక్కడో అమెరికాలో జరిగిన కార్మిక పోరాట నేపథ్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం జరిపే కమ్యూనిస్టులు, ట్రేడ్ యూనియన్‌లు, చైనా, రష్యా దేశాల విప్లవాల గురించి చెప్తారే కానీ అంబేడ్కర్ కార్మికుల కోసం పోరాడి తెచ్చిన చట్టాల గురించి ప్రస్తావించరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు అంబేడ్కర్ పోరాడి సాధించిన చట్టాలే ఈనాడు భారతీయ కార్మిక వర్గ సమాజానికి పునాది రాళ్ళుగా నిలిచాయన్నారు. అంబేడ్కర్ కార్మిక, కర్షక, దళిత, గిరిజన, బహుజన, మైనార్టీలకు భారత రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించి వారికి రక్షణ కల్పించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. కార్మికుల కోసం అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అందించన చట్టాలను అనుభవిస్తున్న కార్మిక సమాజం మేడేను అంబేడ్కర్ మేడేగా జరుపుకోవాలని డిమాండ్ చేశారు.

4 నుంచి పోలేరమ్మ తిరునాళ్లు

చినగంజాం: మండలంలోని సోపిరాలో మే 4,5,6,7 తేదీల్లో పోలేరమ్మ తిరునాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 4వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు సద్దులు, సాయంత్రం 5 గంటలకు వడపప్పు పానకం కార్యక్రమం, సోమవారం ఉదయం 7 గంటలకు సద్దులు, సాయంత్రం 5 గంటలకు వడపప్పు పానకం, రాత్రి 8 గంటలకు ధర్మతేజ సినీ డూప్ ఈవెంట్స్ వారిచే సాంస్కృతిక కార్యక్రమం జరగనుంది. మంగళవారం పసుపు కుంకుమలతో, నీళ్ళ బిందెలతో సోపిరాల గ్రామ ప్రజలు ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానం వద్దకు చేరి అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలతో, మహిళా కోలాటాలతో విద్యుత్ ప్రభ ఊరేగింపు, రాత్రి అమ్మవారి ఆలయం వద్ద తిరునాళ్ల కార్యక్రమం జరుగుతుందన్నారు. 70 అడుగుల విద్యుత్ ప్రభ ఏర్పాటు, రాత్రి 8 గంటలకు మాధవ ఈవెంట్స్ నెల్లూరు వారిచే పాటకచ్చేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 7 వ తేదీ బుధవారం పోలేరమ్మ పొంగళ్ళు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

దుర్గంధంగా వల్లాపల్లి ఎస్టీ కాలనీ

- సిమెంటు రోడ్లు వేశారు.. కాలువలు మరిచారు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు



వల్లాపల్లి ఎస్టీ కాలనీలో మురుగు

బల్లికురవ: గ్రామాల వారీగా సిమెంటు రోడ్లు నిర్మించి మురుగు కాలువలు నిర్మించకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు ప్రవహించడంతో ప్రజలకు వాహనచోదకులకు కష్టాలు తప్పడం లేదు. మండలంలోని వల్లాపల్లి, మల్లాయపాలెం, సోమవరప్పాడు, కోటవారిపాలెం, వేమవరం గ్రామాల్లో ప్రజలు మురుగుతో నానా ఇబ్బందులు పడుతున్నారు. వల్లాపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీలో వర్షాకాలం.. ఎండాకాలం అనే తేడా లేకుండానే మురుగు నీరు ప్రవహిస్తుండటం, నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసంగా మారాయి. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేయడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రభుత్వం గ్రామాల వారీగా సైడు కాలువల నిర్మాణాన్ని పూర్తి చేయించి ఆరోగ్య వాతావరణాన్ని కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



వల్లాపల్లి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

అద్దంకి: తగు ముందు జాగ్రత్తలతో క్షయ వ్యాధి రాకుండా చేసుకోవచ్చని గాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి జయసింహ అన్నారు. బుధవారం సై–టీబీ పరీక్షలు నిర్వహించారు. దానిలో భాగంగా వ్యాధి గ్రస్తులు వివశించే ప్రాంతాలకు సమీపంలోని అనుమానితులను, తోటి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ కొత్త పరీక్షను ప్రభుత్వ వైద్యశాల పరిధిలోనే అందుబటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. అనుమానం ఉన్నవారుసైతం పరీక్ష చేయంచుకోవాలని సూచించారు. బాపట్ల జిల్లా టీకా నియంత్రణ డాక్టర్ మనోజ్ ప్రద్యోత్, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వెంకాయమ్మ, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది